ప్రజాశక్తి

శుక్రవారం 13 సెప్టెంబర్ 2024



సిఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి -పాడేరు : స్థానిక శ్రీ మోదమాంబ హై స్కూల్ విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రు.1 లక్ష 5 రూపాయల విరాళాన్ని అందజేశారు. గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్‌ను కలిసి విద్యార్థులు సేకరించిన లక్ష రూపాయల నగదును జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ కు అందజేశారు. విరాళం అందించిన పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు.



పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలెక్టర్

సీతారాం ఏచూరి మరణం తీరనిలోటు



చింతపల్లిలో నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



అనంతగిరిలో..

ప్రజాశక్తి - చింతపల్లి : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటుని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనరస అన్నారు. ఆ పార్టీ చింతపల్లి కార్యాలయంలో ఆయన ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నిబద్ధత కలిగిన నాయకున్నిఉద్యమ నేతను కొల్పోవడం బాధాకరమన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి చట్టసభలలో నిర్వహించిన పాత్ర ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, బోనంగి చిన్నయ్య పడాల్, చింతపల్లి, జీకే వీధి మండలాల కార్యదర్శులు, పాంగి ధనుంజయ్, గడుతూరు సత్యనారాయణ, పాంగి బాలయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో..

అరకులోయ రూరల్:సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల ఆ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఏచూరి చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, సీతారాం ఏచూరి మృతి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)కి తీరని లోటన్నారు. సమాజంలో పీడిత ప్రజలకు అణగారిన వర్గాలు, కార్మికులకు, కష్టజీవులకు బడుగు బలహీనవర్గాలకు జరిగే ప్రతి అన్యాయం పట్ల పార్లమెంట్లో తనదైన శైలిలో ప్రశ్నించారన్నారు. సీతారాం ఏచూరి కాకినాడలో జన్మించి విద్యార్థి నాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగి పార్లమెంట్ స్థాయికి చేరుకొని ప్రజల కోసం నిరంతరం గొంతై నిలిచారన్నారు. దేశంలో మతోన్మాదం పెరుగుతున్న కాలంలో సీతారం ఏచూరి దానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. నమ్మిన సిద్ధాంతాన్ని తన తుది శ్వాస విడిచే వరకు అనుసరించారని కొనియాడారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడలో ఉన్నత కుటుంబంలో జన్మించి అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపించారన్నారు. కుల నిర్మూలన జరగాలని విద్యార్థి దశ నుండి పోరాటం చేసారని గుర్తు చేశారు.కార్మిక, కష్టజీవుల బతుకులు మార్చడానికి తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివరి శ్వాస వరకు అనుసరించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌బి పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, సిపిఎం మండల నాయకులు కిల్లో జగన్నాథం, కె.సత్యనారాయణ, సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు, డుంబ్రిగూడ మండలం గసభ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, కిల్లో సహదేవ్, చిట్టిబాబు, కె.మగ్గన్న వార్డు మెంబర్ కొర్రా అప్పలమ్మ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట:సీతారాం ఏచూరికి సీపీఎం మండల కమిటీ నేతలు నివాళులు అర్పించారు. అనంతరం హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి రాజకీయాలకు ఆకర్షితులై అంచెలంచెలుగా భారత దేశంలోనే అగ్ర రాజకీయ నేతల్లో ఒకరిగా ఎదిగారన్నారు. ఇంటర్మీడియట్ సీబీఎస్ఈలో ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించి టాఫర్ గా నిలిసి మూడు పర్యాయాలు ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) అధ్యక్షుడు గా ఎన్నికయ్యారన్నారు. జేఎన్‌యూ ను కమ్యూనిస్టుల ఎర్ర కోటగా మార్చి ఎంఏ ఎకనమిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం లో కీలక పాత్ర పోషించారన్నారు. ఏచూరి రైతులు, కార్మికులు, ఉద్యోగుల, కష్ట జీవుల పక్షాన నిలబడి పార్లమెంట్ లో వారికి అనుకూల చట్టాలు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకురాలు సొంటేన హైమావతి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాపుల కృష్ణారావు, ఇందిర, లక్ష్మీ,గెమ్మెలి ఆనంద్, పాడి నరసింహ మూర్తి, ఆదివాసీ సేన నాయకులు చుంచు రాజబాబు, పాల్గొన్నారు.



హుకుంపేటలో..

అనంతగిరి: సీతారాం ఏచూరి చిత్రపటానికి అనంతగిరి జెడ్పిటిసి దీసరి, గంగరాజు, మండల కార్యదర్శి ఎస్,.నాగులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ప్రజా పోరాట యోధుడు దూరం కావడం పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రాజవొమ్మంగి:సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. సీతారాం ఏచూరి మృతికి పార్టీ నాయకులు, సభ్యులు అభిమానులు గురువారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ గొప్ప మానవతావాది, మార్క్సిస్టు మేధావి, గ్రేట్ పార్లమెంటేరియన్, ఆర్థిక వేత్త, సిద్ధాంతవేత్త అయిన సీతారాం ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. రథసారథికి విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, రామరాజు, శ్రీను, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి, శబరి

- ఇంకా ముంపులోనే పలు రహదారులు
- రోడ్లపై బారులు తీరిన వాహనాలు



శ్రీరామగిరి గ్రామం వద్ద ఇంకా తగ్గని వరద నీరు

ప్రజాశక్తి-చింతూరు, విఆర్.పురం

రెండు రోజుల పాటు ఉగ్రరూపం దాల్చిన గోదావరి, శబరి నదులు శాంతించాయి. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 48.4 అడుగులున్న గోదావరి గురువారం సాయంత్రానికి 43 అడుగులకు తగ్గింది. దీంతో భద్రాచలం వద్ద రెండు ప్రమాద హెచ్చరికలు ఎత్తివేశారు. మరో వైపు చింతూరు వద్ద శబరి నీటి మట్టం గురువారానికి 41 అడుగులకు తగ్గింది. అయితే నేటికీ చింతూరు, విఆర్.పురం, కూనవరం, ఎటపాక తదితర విలీన మండలాల్లోని పలు రహదారులు ముంపులోనే ఉన్నాయి. వరద నీరు రహదారులపై నుండి పూర్తిగా తొలగకపోవడంతో జాతీయ రహదారి-30పై చింతూరు మండలం చట్టి వద్ద చత్తీస్‌ఘడ్- ఆంధ్ర రహదారి వాహనాలతో నిండిపోయింది. ఒడిశా- ఆంధ్ర రహదారి కూడా వరద ముంపులోనే ఉండడంతో వాహనాలు వందల సంఖ్యలో నిలిచిపోయాయి. వాగుల నీరు ఇంకా తగ్గకపోవడంతో చుట్టుపక్కల 40 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి వీలు లేకుండా ఉంది. కొన్ని గ్రామాల్లో ఇంకా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకట్లోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విఆర్.పురం మండలంలోని వడ్డిగూడెం, శ్రీరామగిరి గ్రామాల్లో వరద నీరు పూర్తిగా తగ్గలేదు. దీంతో రేఖపల్లి, ఇతర పునరావాస కేంద్రాల్లో ఉన్న వారు తమ గృహాలు ఎలా ఉన్నాయో చూసుకునే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతూరులోని శబరి ఒడ్డు ప్రజలు బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుపై బరకాలతో గుడారాలు వేసుకొని నివాసముంటూ ఇబ్బందులు పడుతున్నారు. వర్షం లేని కారణంగా ప్రజలు తమ తమ నివాసాలకు వెళ్లి శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. చింతూరు ఏపీఆర్ పాఠశాలలోని పునరావాస కేంద్రంలో ఉన్న నిర్వాసితులకు ప్రభుత్వం తరపున నిత్యవసర వస్తువులను, పాల ప్యాకెట్లను అందజేశారు. విఆర్.పురం మండలంలోని ముంపు గ్రామాలకు కనీసం నిత్యవసర సరుకులు, కిరోసిన్, కొవ్వొత్తులు ఇవ్వలేదని, రాత్రి సమయంలో ఎక్కడ నుండి ఏ విష పురుగు కాటు వేస్తుందోనని భయం గుప్పెట్లో జీవిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు త్యాగం చేసిన తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు చిన్నచూపుచూస్తున్నారని వాపోయారు.



రేఖపల్లిలో గుడారాల్లో ఉన్న వరద బాధితులు

అంధకారంలో గిరిజన గ్రామాలు

వరద నీటిలో పడవపై విద్యుత్ వైర్లు పట్టుకొని ఎంపిపి నిరసన



బోటులో వెళ్లి విద్యుత్ వైర్లు పట్టుకొని నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఏజెన్సీ గిరిజన గ్రామాలైన ప్రత్తిపాక, సృష్టివారి గూడెం, అడవి వెంకన్నగూడెం, రామవరం పంచాయతీల పరిధిలో కొద్దిపాటి గోదావరి వరదకే విద్యుత్ స్తంభాలు మునిగిపోతున్నాయని ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ సప్లైను ఆపేస్తున్నారని, ఫలితంగా గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గిరిజన గ్రామాలపై నిర్లక్ష్యం వీడాలని కోరుతూ నాటు పడవపై వెళ్లి నీట మునిగిన విద్యుత్ వైర్లను పట్టుకొని ఎంపిపి, సిపిఎం నేతలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా కాకపోవడంతో రక్షిత మంచినీటి పథకాలు పనిచేయగా గిరిజనులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గోదారి వరదకు వచ్చిన మురికినీటినే తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. 15 విద్యుత్ స్తంభాలు ఎత్తైన ప్రాంతంలో వేస్తే 60 అడుగులు గోదావరి వరద వచ్చినా గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్తుశాఖ అధికారులకు తెలిసిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఐటిడిఎ పిఒ, కలెక్టర్ వివిధ సమస్యలపై సమీక్షలు సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఈ సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం మండల కమిటీ సభ్యులు కుంజ నాగిరెడ్డి, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, రామవరం గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మన్యంలో ఆగని శిశు మరణాలు

-రెండు రోజుల్లో ఇద్దరు చిన్నారుల మృతి
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని మత్స్యపురం పంచాయతీ కొత్తవలస గ్రామానికి చెందిన జన్ని దానియేలు సంధ్య దంపతుల నాలుగున్నర నెలలు పాప వాంతులతో బాధపడుతోంది. జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు అందించినప్పటికీ బుధవారం ఉదయం మరణించిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. అలాగే తీగల వలస పంచాయతీ గరుడ పల్లి గ్రామానికి చెందిన కిలో కోటి బాబు దివ్య దంపతుల రెండు నెలల బాబు ఊపిరి తిత్తుల సమస్యతో జిల్లా ఆస్పత్రి నుంచి వైజాగ్‌కు తరలిస్తుండగా బుధవారం సాయంత్రం మరణించారని తల్లిదండ్రులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో చిన్నారుల మృతి ప్రభుత్వ హత్యలే అని వైసిపి జిల్లా యువజన ఎస్టీ సెల్ కార్యదర్శి పెనుమల రమేష్ ఆరోపించారు.ఏజెన్సీ ప్రాంతంలో మరణాలపై సమగ్ర విచారణ చేపట్టి, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనాలు మరల పునరువృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



బాలుడి మృతదేహం

వంతెనల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయండి

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్

ప్రజాశక్తి-పెదబయలు: వచ్చే జనవరి నాటికి వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం పెదబయలు మండలంలో పర్యటించి వివిధ వంతెనల పనులను, గెడ్డలను పరిశీలించారు. గిన్నెలకోట వంతెనను జనవరి నెలలో ప్రారంభించాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈని ఆదేశించారు. . వంతెన నిర్మాణం జరిగితే గిన్నెలకోట, జాంగూడ, బూసుపుట్టు, గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడుతుందని చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పిట్ట గుడ్లు, కోరంగి, మెట్టగూడ, కంచూరియా గ్రామాలకు రహదారి సదుపాయం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె వేణుగోపాల్, ఎంపీడీవో, తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న పిఒ



సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-అనంతగిరి:ఉత్తమ అవార్డులు అందుకున్న స్థానిక ఉపాధ్యాయులు ఈశ్వరరావు, కె.అప్పలరాజు. మహదేవ్, నారాజీ మల్లేశ్వరరావులకు స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద స్థానిక సీపీఎం జెడ్పీటిసి దీసరి గంగరాజు, మండల విద్యాశాఖ అధికారులు కె , బాలాజీ, వెంకటరమణ, మండల యూటీఎఫ్ ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి గంగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పటాసి ప్రసాద్ రావు, గిరిజన సంఘం మండల నాయకులు ఎస్, నాగులు, యుటిఎఫ్ మండల నాయకులు శెట్టి రాంబాబు, సొమర, పి దేవుడు, భాస్కరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు

చట్రాపల్లి బాధిత కుటుంబాలను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలి

- సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పార్టీ బృందం



కొండచరియలు పడి ధ్వంసమైన చట్రాపల్లి గ్రామాన్ని పరిశీలిస్తున్న అప్పలనర్స తదితరులు

ప్రజాశక్తి-సీలేరు

భారీ వర్షాలకు జికె.వీధి మండలం చట్రాపల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన, గాయపడిన, ఇల్లు కోల్పోయిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ మేరకు అప్పలనర్స నేతృత్వంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.చిన్నయ్య పడాల్, పార్టీల నాయకుల బృందం చట్రాపల్లి గ్రామాన్ని గురువారం సందర్శించింది. రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనాలపై గ్రామానికి చేరుకున్నారు. బాధితులు సిపిఎం నాయకుల ముందు ఆర్తనాధాలతో తమ గోడును వెల్లబుచ్చారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కొన్ని గంటల వ్యవధిలోనే మూడుసార్లు కొండ చరియలు గ్రామంపై విరుచుకుపడి వరదరావడంతో తేరుకోలేకపోయామని పేర్కొన్నారు. దీనిపై అధికారులకు తెలియజేసిన సకాలంలో స్పందించలేదన్నారు. మట్టి కింద కూరుకుపోయిన మేకలు, కోళ్ళు, పశువులు కుళ్ళిపోయి తీవ్ర దుర్గంధం వస్తుందని, వాటిని తొలగించడానికి అధికార యంత్రాంగం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని వాపోయారు.

ఈ సందర్భంగా అప్పల నర్స మాట్లాడుతూ మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి ప్రభుత్వం కేవలం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పినా నేటికీ ప్రభుత్వ నుండి ఎటువంటి చర్యలు లేవని విమర్శించారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షలు, గాయపడిన వారికి లక్ష రూపాయలు, ఇల్లు కోల్పోయిన వారికి రూ.10 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామానికి మోడల్ కాలనీ ప్రభుత్వం మంజూరు చేసి నిర్మించాలని కోరారు. భారీ వర్షాలకు ధ్వంసమైన సీలేరు లంకపాకల మధ్యలో రహదారిని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.



బాధితులకు నిత్యావసరాలు, సామగ్రి అందిస్తున్న దృశ్యం

పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలకు పరామర్శ

చట్రాపల్లి బాధితులకు సప్పర్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సిపిఎం బృందం సందర్శించింది. బాధితులకు భోజనం, వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు. కట్టు బట్టలతో రోడ్డుమీద పడ్డామని వారి రోదించారు. ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించడం లేదన్నారు. జీకే వీధి పంచాయతీ కుంకుమపువ్వు గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల టీచర్లు, గిరిజన సంఘ కార్యకర్తలు పరమేష్ ఆధ్వర్యంలో సేకరించిన నిత్యవసర సరుకులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. పది బిందులు, 20 తపలాలు, 100 కేజీల బియ్యం, 15 చీరలు, 20 రగ్గులు, 10 జతలు బట్టలు, రూ.3000 నగదు అప్పలనర్స చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జికె.వీధి, చింతపల్లి మండలాల కార్యదర్శులు అంపరంగి బుజ్జిబాబు, పాంగి ధనుంజయ్, నాయకులు గడుతూరి సత్యనారాయణ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష వాలంటీర్లకు

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో మాతృ బహు భాష వాలంటీర్లకు 3 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని మండల విద్యాశాఖ అధికాలు సోమేలి చెల్లయ్య, కొడా ఈశ్వరరావులకు గురువారం వినతి పత్రాన్ని మాతృభాష వాలంటీర్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మాతృభాష వాలంటీర్ల జిల్లా అధ్యక్షులు మర్రి చిట్టిబాబు, మండల కార్యదర్శి కిల్లో.నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు వంతల రాంబాబు, సీదారి. చిట్టిబాబు, కృష్ణారావు, శివ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మాతృభాష వాలంటీర్లు

జిఒ 85పై దశల వారీ ఆందోళనలు

ప్రజాశక్తి -సీలేరు

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 85కు వ్యతిరేకంగా ప్రభుత్వ వైద్యులు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని దారకొండ పిహెచ్సి వైద్య అధికారి డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. ఆమె స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ఎంపిపి హెచ్ సిపిఎం) వైద్యులు జిఒ నెంబర్ 85కి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్లు డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని చింతపల్లి, జికె.వీధి మండలాల్లో ప్రభుత్వ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. జీవో నెంబర్ 85 ద్వారా వలన తమ మూడేళ్ల సర్వీస్ (రూరల్) రెండేళ్ళు గిరిజన ప్రాంతంలో చేసిన సర్వీసుకు అర్థం లేకుండా పోయిందని వాపోయారు. గత రెండు నెలలుగా జీవో నెంబర్ 85 రద్దు చేయమని ప్రభుత్వ అధికారులకు, శాసనసభ్యులకు అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని పేర్కొన్నారు. ఈ 85 జిఒ ప్రకారం మునుపు ఉన్న ఇన్ సర్వీస్ కోటాను క్లినికల్ బ్రాంచెస్ 30 శాతం నుంచి 15 శాతానికి కుదించారని తెలిపారు.



కల్వర్టును పరిశీలిస్తున్న సురేంద్ర

కల్వర్టును వెంటనే నిర్మించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే సురేంద్ర

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ నేరేడువలస కల్వర్టును వెంటనే నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే సురేంద్ర డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామంలో సందర్శించారు. గ్రామస్తులు రాకపోకలకు తాత్కాలికంగా కర్రలతో నిర్మించిన నిర్మాణాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్వర్టు నిర్మించక పోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అనారోగ్యాలకు గురైన వారిని అత్యవసర పరిస్థితిల్లో హాస్పిటల్ కు తరలించడానికి అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నేరేడు వలస మీదుగా గుంటసీమ పంచాయతీ తద్దా గ్రామానికి కూడా రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఉన్నత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ ప్రాంతం గిరిజనులతో కలిసి ఆందోళన చేపడుతుందని ఆయన హెచ్చరించారు. ఆ పార్టీ మండల నాయకులు పి సింహాచలం, గ్రామస్తులు అలెగ్జాండర్ ప్రధాని, జన సుధా రెడ్డి పాల్గొన్నారు.

పరిపాలనా పరమైన బదిలీ మాత్రమే

- డీడీ బదిలీపై కలెక్టర్ స్పష్టత

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ పాడేరు ఉపసంచాలకులు కొండలరావుకు రంపచోడవరం బదిలీ జరిగిన సంగతి విదితమే. అయితే ఈయన బదిలీపై రాజకీయపరమైన విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో, బదిలీ పాలనా పరమైన (అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్) బదిలీ మాత్రమేనని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక దిన పత్రికలో "కూటమి సర్కారులో వై సి పి నేత హవా?" శీర్షిక వచ్చిన వార్తపై జిల్లా కలెక్టర్ ఖండిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలనలో భాగంగా బదిలీ జరిగిందని చెప్పారు. గిరిజన సంక్షేమ సంస్థలపై పలుమార్లు సమీక్షలు చేసిన అనంతరం మరియు వాటిపై విచారణ నిమిత్తం చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. ఈ బదిలీ ఎటువంటి సిఫార్సులతో జరగలేదని, ఎటువంటి సిఫార్సు లేఖలు కలెక్టరు కు అందలేదని వివరించారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు ఇస్తున్న కృష్ణకుమారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలోని కె.కొండలరావు నివాస గృహం గోడ కూలి పోవడంతో నిరాశ్రయులుగా మారారు. ఆయనకు మానవ హక్కుల నేరనిరోధక సంస్థ రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగ అధ్యక్షురాలు కే కృష్ణకుమారి బియ్యం, పప్పుతో పాటు ఇతర నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు మేధావి ఏచూరికి

విశాఖతో విడదీయరాని అనుబంధం



- విశాఖలో సిపిఎం 21వ జాతీయ మహాసభకు 2015లో హాజరు
- ఇక్కడే జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక
- ఆలోచింపజేసే ప్రసంగాలకు పెట్టింది పేరు...
- ఆయన మృతితో పార్టీలకతీతంగా తీవ్ర దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : దేశంలో గొప్ప రాజనీతిజ్ఞుల్లో ఒకరు... కమ్యూనిస్టు మేధావి... సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధితో గురువారం సాయంత్రం 4 గంటలకు తుది శ్వాస విడిచారు. ఏచూరికి విశాఖతో విడదీయరాని ఉద్యమ సంబంధం ఉండడంతో కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నాయకులే గాకుండా ఇతర పార్టీల పెద్దలు సైతం ఆయన్ను స్మరించుకుంటూ 'గొప్ప నాయకుడ్ని ఈ దేశం కోల్పోయింది' అంటూ ఆవేదన చెందడం కనిపించింది. ముఖ్యంగా విశాఖపట్నం ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం కావడంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఢిల్లీ స్థాయిలో పోరాడడంలోనూ, షిప్‌యార్డు, బిహెచ్‌పివి, డిసిఐల రక్షణ కోసం జరిగిన ఉద్యమాల సందర్భాంగా విశాఖకు అనేక పర్యాయాలు ఢిల్లీ నుంచి ఏచూరి వచ్చి ప్రజా ఉద్యమాలకు, కార్మికోద్యమాలకు అండగా భరోసా నిస్తూ పోరాటాల్లో పాల్గొనేవారు. 2021లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేశాక పలుసార్లు విశాఖ కార్మిక సభల్లో ప్రసంగిస్తూ ఉద్యమాలకు అన్ని తరగతులనూ సమీకరించి పోరాటాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలో అనేక సలహాలు ఇచ్చి చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషించారు. 2023 సెప్టెంబర్‌లో స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన బహిరంగ సభలో ప్రధాన వక్తగా పాల్గొని దేశ రాజకీయాలను దిగజార్చుతూ, కార్మిక, రైతు ఉద్యమాలను అణగదొక్కాలని చూసే బిజెపి విధానాలపై కార్మికవర్గం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

2015లో విశాఖ మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక

2015 ఏప్రిల్ 14 నుంచి 19వ తేదీ వరకూ విశాఖలో జరిగిన సిపిఎం పార్టీ 21 వ జాతీయ మహాసభలకు సీతారాం ఏచూరి జాతీయ నాయకుడిగా విచ్చేశారు. ఈ సభల్లో ఆయన్ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖపట్నం గీతం కాలేజీలో ఈ మహాసభలకు హాజరైన ప్రతినిధులందరికీ ముఖ్యంగా అతిథులకు అప్పటి గీతం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఎంవివిఎస్ మూర్తి ఆతిథ్యం ఇచ్చారు. గీతం కాలేజీకి చెందిన పలువురు అధ్యాపకులు, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు నాటి ఫోటోలను ప్రజాశక్తికి షేర్‌చేసి ఘనంగా ఏచూరిని స్మరించుకున్నారు.

రైతులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : రైతులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారులు గ్రూపులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమాశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేత మవ్వాలని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను పరిరక్షించాలని అన్నారు. గిరిజన ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు ఎరువులు వ్యవసాయానికి సాగుకు యంత్రపరికరాలు, ఉపకరణాలు అందించాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించడంతో ఆదాయం తగ్గి పోతుందన్నారు. చెక్ డ్యాంల నిర్మాణాలు, మరమ్మతుల బాధ్యత ఎఫ్.పి. ఓలకు అప్పగిస్తామన్నారు.

నాబార్డు జిల్లా వికాస అధికారి రావూరి చక్రధర్ మాట్లాడుతూ, జిల్లాలో 50 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహిస్తామన్నారు. రుణాలు అందించే విధంగా బ్యాంకర్లతో సమన్వయం చేస్తామన్నారు. అదే విధంగా గ్రాంటు సహకారం అందిస్తమన్నారు. విత్తన సంపదను కాపాడాలని సూచించారు. విత్తన తయారీ నర్సరీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. కష్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అరకు కాఫీ బ్రాండును వినియోగించుకోవడానికి రైతు ఉత్తిదారుల సంఘాలు కాఫీ బోర్డు దగ్గర ఆథరైజ్డ్ యూజర్ సర్టిఫికేట్ పొందాలని చెప్పారు. రైతు ఉత్పతిదారుల సంఘాలకు అవసరమైన శిక్షణలు, క్షేత్ర సందర్శనలకు తీసుకుని వెళతామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్ .నంద్, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కల్యాణి, కాఫీ బోర్డు అధికారి పి.దుర్గా భవాని, పలువురు మండల ఉద్యానవన అధికారులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న సర్వే బృందం అధికారులు

హైవే రోడ్డు విస్తరణకు కొలతలు

ప్రజాశక్తి -అనంతగిరి: నేషనల్ హైవే రోడ్డు విస్తరణ కొలతల పనులు మండల కేంద్రంలో గురువారం ప్రత్యేక రెవిన్యూ స్పెషల్ బృందం చేపట్టింది. స్థానిక జెడ్పిటిసి, సర్పంచుల సహాయంతో కొలతలు చేపట్టారు. బొడ్డచెటు కాలనీలో మొదలైన కొలతలు విద్యుత్ సబ్‌స్టేషన్ వీధి, జిసిసి డిఆర్ డిపో నుండి జూనియర్ కళాశాల ఊటగడ్డ వరకు ఉన్న జిరాయితీ ప్రభుత్వ భూములలో గుర్తించి సర్వే నిర్వహించారు సర్వే బృందం స్పెషల్ ఆఫీసర్ రామ్మూర్తి మాట్లాడుతూ, నేషనల్ హైవే రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి జిరాయితి భూమి తో పాటు స్థానికులు కట్టుకున్న ఇల్లు, ఇతర కిరణా దుకాణాలు వంటి వాటిని గుర్తించామన్నారు. వాటి వివరాలను నమోదు చేసుకున్నామని పరిహారం నిమిత్తం జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆయన అన్నారు. రైతుల భూమి, ఇల్లు ,షాపుల, పై ఆధారాలను తమ రెవిన్యూ సిబ్బందికి అందజేయాలని రైతులకు సూచించారు. జడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డులో ఆనుకుని ఇల్లు, షాపులు, రైతులకు పూర్తిస్థాయి న్యాయం అందించిన అనంతరమే పనులు చేపట్టాలని ఆయన రెవిన్యూ సర్వే ప్రత్యేక బృందాన్ని కోరారు. రైతులకు అన్యాయం జరిగితే తాము చూస్తూ ఊరుకోమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ స్పెషల్ సర్వే బృందం అధికారులు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు, స్థానిక ఉపసర్పంచ్ పి, అర్జున్ సర్వేయర్ భాస్కరరావు, రెవిన్యూ సిబ్బంది లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు

ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు

14 నుంచి సిపిఎం రక్షణ యాత్ర

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు పాయకరావుపేట నుంచి అచ్చుతాపురం వరకు సిపిఎం ఆధ్వర్యాన చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు పిలుపునిచ్చారు. అనకాపల్లిలోని సిపిఎం కార్యాలయంలో గురువారం బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకనాథం, కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఏ కంపెనీలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో, డ్యూటీలకు వెళ్ళిన తమ కుటుంబ సభ్యులు క్షేమంగా ఇంటికి వస్తారో? రారో తెలియని భయాందోళనలో కార్మికులు వారి కుటుంబాలు ఉన్నాయన్నారు. మన జిల్లాలో గత 25 సంవత్సరాల్లో జరిగిన పారిశ్రామిక ప్రమాదాలలో ఈ ఏడాది ఆగస్టు 21న అచ్యుతాపురం వద్ద 'ఎసెన్షియా ఫార్మా'లో జరిగిన ప్రమాదం అతిపెద్దదన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం, ప్రభుత్వాల అలసత్వానికి 17 మంది కార్మికుల నిండు ప్రాణాలు బలయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మరణిస్తే మన అనకాపల్లి జిల్లాలో 6 ఏళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది చనిపోగా, 92 మంది తీవ్ర గాయాలతో క్షతగాత్రులయ్యారని తెలిపారు. లెక్కకు రాని మరెన్నో ప్రమాదాలు ఉన్నాయన్నారు. ఎస్ఇజెడ్‌లలో కంపెనీలు భూములు, నీరు, కరెంట్ వంటి అనేక మౌలిక వసతులు, రుణాలు తదితర రాయితీలు ప్రభుత్వాల నుంచి ప్రజల సొమ్ముతో పొందుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీల వ్యాపారాల కోసం నిబంధనలను సరళతరం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో ఫ్యాక్టరీలను తనిఖీలు చేయకుండా అధికారులపై కేవలం ఆంక్షలు విధించడంతో ఈ ప్రమాదాలు మరింత పెరగడానికి ప్రధాన కారణమయ్యాయని తెలిపారు. 2016లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత తనిఖీల విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం జిఒ 62 తీసుకొచ్చి రెగ్యులర్ తనిఖీలను అటకెక్కించిందని మండిపడ్డారు. ఈ జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కంపెనీలపై వేధింపులు ఉండకూడదనే పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, లేబర్ డిపార్టుమెంట్, ఫైర్, బాయిలర్ చెకింగ్ వ్యవస్థలు మొద్దునిద్రలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదకర ఫార్మా, కెమికల్ కంపెనీలలో తరచు తనిఖీలు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

గోదావరి, శబరి ముంపు ప్రాంతంలో

రాష్ట్ర మంత్రులు పర్యటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-చింతూరు : గోదావరి, శబరి, వరదలతో చింతూరు డివిజన్లో 4 మండలాలు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతం అంతా రైతులు, సామాన్య ప్రజానీకం సర్వం కోల్పోయారని, వరదలతో నష్టపోయిన ప్రాంతాన్ని మంత్రుల బృందం పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం చింతూరు పార్టీ కార్యాలయం నందు ముఖ్య కార్యకర్తల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ వరదలు కారణంగా పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, వరికి తక్షణ సహాయం రూ.10,000, పత్తి, మిర్చి, పత్తి మిర్చి సాగు రైతులకు రూ.30 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ముంపునకు గురై ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలు అందించాలని, ఇల్లు కూలిపోయిన వారికి ఇల్లు నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు ఆరుతడి పంటలైన నువ్వులు, మినుములు, పెసర్లు విత్తనాలు, ఎరువులు ఉచితం అందించాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతా గ్రామాల్లో ఆరోగ్య ,పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది పునరావాసం, పరిహారం గ్రామసభలు నిర్వహణ తప్ప ఆచరణ ఎక్కడా కనిపించడం లేదన్నారు. నిర్వాసితులకు పరిహారం ఇచ్చి పునరావాస ప్రదేశానికి తరలిస్తే ఈ ప్రాంత ప్రజానీకానికి ఇబ్బందులు తగ్గుతాయని, తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితుల సమస్యను పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి, సీసం సురేష్, జిల్లా నాయకులు పల్లపు వెంకట్, సిరిమల్లె రెడ్డి, మొత్తం రాజయ్య, మడకం నందా, మొత్తం కిట్టయ్య కౌసల్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అమలవుతున్న వివిధ పనుల గురించి సామాజిక తనిఖీ కార్యక్రమం గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వివిధ రకాల పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం మండలంలో ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించడం జరిగింది. సర్వే సంబంధించి అక్కడక్కడ కొన్ని చోట్ల రైతులకు పనిని చూపించకపోవడం వంటి లోపాలు ఉన్నాయని, అన్ని చోట్ల సానుకూలంగా ఉన్నట్లు ముఖ్యఅతిథిగా వచ్చిన దోమ పిడి ఏ శివయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంపీడీవో ఏ వీర కిషోర్, నిర్మలాదేవి ఎస్ఆర్పిఎస్ రాజు ఏపీవో రెడ్డి బాబు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇతరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఏజెన్సీ ప్రాంతమైన రాజవొమ్మంగి మండలంలో ఆరోవరోజు గురువారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. రాజవొమ్మంగి గ్రామంలో విద్యుత్ నగర్, గాంధీ బొమ్మ సెంటర్, నూకాలమ్మ గుడి వీధి తదితర చోట్ల ఏర్పాటు చేసిన గణేశ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. చిన్నారులు, పెద్దలు కోలాటం, నృత్యాలు వేషధారణలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వినాయక విగ్రహాలను అప్పలరాజుపేట రిజర్వాయర్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీ సభ్యులు జి వెంకట్రావు చౌదరి, కె నూకరాజు,శ్రీను, రామరాజు, ప్రసాదు, బాబి సత్తిబాబు, వర్మ, అమ్మోజి, దేవి, మణి ఈశ్వరరావు, బుజ్జి,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పిఒ, సబ్ కలెక్టర్ పర్యటన



బాధితులకు నిత్యవసరాల కిట్ అందజేస్తున్న పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-విఆర్.పురం : చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ గురువారం మండలంలోని ముంపునకు గ్రామాల్లో పర్యటించారు. ధర్మతాళగూడెం గ్రామంలో వరద బాధితులకు ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేశారు. రేఖపల్లిలో గుడారాలు వేసుకొని నివాసమున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఎఎస్‌డిఎస్ గాంధీ బాబు ఆధ్వర్యంలో జడ్పిటిసి వాల్ల రంగారెడ్డి, సర్పంచ్ పూనం సరోజిని, సబ్ కలెక్టర్, పిఒ, చేతుల మీదుగా వరద బాధితులకు నిత్యవసర సరుకులు అందించారు. తహశీల్దారు కార్యాలయంలో వరద బాధితులతో పోలవరం సమస్యలు గురించి చర్చించి త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. రేఖపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలు గురించి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వారి వెంట తహశీల్దారు, సుబ్బారావు, సీఐ, పోలీసు, వెలుగు, రెవెన్యూ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

తెగిన కేబుల్ వైర్లు

- అస్తవ్యస్తంగా బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్



బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయక బోసిపోయిన యూనియన్‌బ్యాంకు

ప్రజాశక్తి -సీలేరు : భారీ వర్షాల కారణంగా జీకే వీధి మండలం సీలేరు - లంకపాకల మధ్యలో కొండ చరియలు ప్రధాన రహదారిపై విరిగి పడడంతో ఓఎఫ్‌సి కేబులు తెగిపోవడంతో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో స్థానిక యూనియన్ బ్యాంకులో ఇంటర్నెట్ సౌకర్యం లేక సేవలు నిలిచిపోయాయి. ఖాతాదారులు గురువారం బ్యాంకులో లేకపోవడంతో వెలవెల పోయింది. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది ఓఎఫ్‌సి కేబులు సరి చేయడానికి రహదారి క్లియరెన్స్ లేకపోవడంతో తలనొప్పిగా మారింది. సీలేరులో ఒక జియో సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రహదారి క్లియరెన్స్ పనులు పూర్తయితే తప్ప బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్స్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావు. అప్పటివరకు బ్యాంకు లావాదేవీలు నిలిచిపోతాయి. ఇంటర్నెట్ సేవలు వినియోగంలోకి వచ్చేవరకు ఖాతాదారులకు ఎటువంటి కష్టం వచ్చినా యూనియన్ బ్యాంకు లో డబ్బులు విత్డ్రా చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ సేవలు ఇంటర్నెట్ సేవలు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేశారు.

కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి -సీలేరు : భారీ వర్షాలు కారణంగా జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కాలనీ ఏడో క్రాస్ రోడ్డు ప్రధాన రహదారిపై భారీ వృక్షం బుధవారం అర్ధరాత్రి కూలిపోయింది. దీంతో రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ మార్గంలో డివివి కాన్వెంట్, జూనియర్ కళాశాల, పాఠశాలలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. రహదారి అడ్డంగా భారీ వృక్షం కూలిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనం తప్ప ఇతర ఏ వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఏపీ జెన్కో అధికారులు వెంటనే భారీ వృక్షాన్ని రహదారి అడ్డంగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిపై రాళ్లు తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు : జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లు చెత్తా చెదారాలు కొండలపై నుంచి కొట్టుకొచ్చి నిలిచిపోయాయి. దీంతో విద్యుత్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈఈ రాజేంద్ర ప్రసాద్ స్పందించి ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులచేత రహదారిపై ఉన్న రాళ్లు రప్పలు, చెత్త చెదారం తొలగించే చర్యలు గురువారం చేపట్టారు.

ఇల్లు కోల్పోయిన వారి వివరాలు

పోలీసు స్టేషన్‌లో అందించాలి

ప్రజాశక్తి-సీలేరు: ఇటీవల వరదలు కారణంగా జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి దారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు గాలికొండ తదితర పంచాయతీల్లో ఇల్లు కోల్పోయిన వారు, పాక్షికంగా దెబ్బతిన్న వారి వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని ఎస్ఐ రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నష్టం కలిగిన వారి చిరునామా, కొట్టుకుపోయిన ఇంటి ప్రదేశం, శిధిలమైన ఇంటి ఫోటోలు, బ్యాంక్ అకౌంట్ నెంబరు, ఫోన్ నెంబరు వివరాలతో అందజేస్తే ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

డి.వెలమలకోటలో పొలంబడి

ప్రజాశక్తి- మారేడుమిల్లి : మండలంలోని బి వెలుమలకోట పంచాయతీ పరిధిలో ఉన్న డి వెలమలకోట చుట్టుపక్కల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పిలుపుమేరకు జెడ్‌బిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి బృందం గురువారం పర్యటించింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని పంచాయతీలోని ప్రజలకు తూటికాయ కషాయం తయారు చేయు విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అధికారి వెంకటేశ్వర్లు, ఐసిఆర్పి లు, పంచాయతీ రైతుల పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధికి కృషి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం



గిరిజన రైతులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన మత్స్యకార రైతులను ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం రంపచోడవరం మండలం పందిరి మామిడి జంక్షన్లోని కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన మత్స్య రైతులకు చేప పిల్లలు పంపిణీ కార్యక్రమానికి ప్రాజెక్ట్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ఏడు మండలాల్లోని 100 మంది రైతులకు 100 ఎకరాలలో గిరిజన రైతులు చేపలు పెంచే విధంగా ఒక్కొక్క చేప పిల్ల రెండు రూపాయలు చొప్పున రైతులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం గిరిజన రైతుల కోసం రెండు లక్షల చేప పిల్లలు పంపిణీ చేయుటకు సిద్ధం చేయడం జరిగిందని చెప్పారు. ఏజెన్సీలోని రైతులు పెంచిన చేపలను ఇతర ప్రాంతాలకు పంపించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ లలిత కామేశ్వరి మాట్లాడుతూ గిరిజన రైతులకు చేప పిల్లలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారి చేతులు మీదుగా రైతులకు చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సైంటిస్టులు కె.వీరాంజనేయులు, ఆదర్శ, ఏడు మండలాలకు సంబంధించిన మత్స్య రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీలో గల అన్నవరం, ఉమ్మడివరం, రెడ్డి గుంపు గ్రామాలు, పోరపు వీధులలో పారిశుధ్య పనులన గురువారం సర్పంచ్ పూనం సరోజిని, సెక్రెటరీ శివప్రసాద్, ఆధ్వర్యాన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్.పురంలో..

మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ విఆర్ పురం గ్రామంలో పారిశుధ్య పనులను సర్పంచ్ నరసమ్మ, గ్రామ సెక్రెటరీ స్వరూప రెడ్డి ఆధ్వర్యాన గురువారం చేపట్టారు. అధిక వర్షాలు పడటంతో శబరి గోదావరి ఉప్పొంగడంతో వడ్డిగూడెం, ధర్మతాలగూడెం, వడ్డుగూడెం కాలనీ గ్రామాల్లోకి వరద వచ్చి గహాలు మునిగాయని వరద తగ్గుముఖం పట్టడంతో పారిశుధ్య పనులు చేపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిర్చి, వరి పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- కూనవరం : గోదావరి వరదల కారణంగా ముంపునకు గురై దెబ్బతిన్న మిర్చి, వరి పంటలకు ప్రభుత్వం నష్టం నష్టపరిహారం చెల్లించాలని పెద్దఆర్కూర్ సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద ఆర్కూర్ గ్రామంలో ముంపునకు గురైన ఇళ్లను, పంట పొలాలను సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ, సచివాలయం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి 54 అడుగుల వరకు వరద ఉధృతంగా ప్రవహించటం వలన వరి, మిర్చి నారు మడులు దెబ్బతిని రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లినదని పేర్కొన్నారు. అధికారులు వెంటనే నష్టం అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటూరు సర్పంచ్ వెంకమ్మ, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు బాబు బొర్రయ్య, గ్రామ సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.